క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దౌల్తాబాద్: మండల పరిధి సురాయిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, ట్రీకటింగ్ కారణంగా చల్లాపూర్, ఈర్లపల్లి, ఇండాపూర్ తదితర గ్రామాలకు శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

స్క్రీనింగ్ క్యాంపు

ధారూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధులపై స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ విజయకుమార్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, ఎంపీటీసీలు, అధికారులకు బీపీ, షుగర్, మధుమేహం టెస్టులు నిర్వహించారు. అనంతరం మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, ఎంపీడీఓ నర్సింహులు, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు శోభారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లతో లబ్ధిదారులు

బొంరాస్‌పేట: దివ్యాంగులకు కమిట్‌మెంట్స్ సంస్థ చేయూతనందించింది. శుక్రవారం సికింద్రాబాద్ ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో చార్జింగ్ ట్రై సైకిళ్లను ఆరుగురికి ఆ సంస్థ సీఆర్‌పీ శిరీష ఉచితంగా అందజేశారు. సైకిళ్లు అందుకున్న వారిలో మేడిచెట్టుతండాకు చెందిన రవీందర్‌నాయక్, నాందార్‌పూర్ నర్సింలు, వడిచర్ల మాన్యానాయక్, బుర్రితండా అనితాబాయి, మహంతీపూర్ బందెప్ప, లగచర్ల పాండులు ఉన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

'భగీరథ'నల్లాలను సర్వే చేయండి

ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి

మోమిన్‌పేట: ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నల్లాలను సర్వే చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక యాప్‌లో ఇంటికి నల్లా ఉన్నది లేనిది, నీరు ఏ మేరకు సరఫరా అవుతోంది, అవి ఆ కుటుంబానికి సరిపోతున్నాయా లేదా తదితర విషయాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పక్షం రోజులకు ఒక సారి తప్పని సరిగా ట్యాంకులను శుభ్రం చేయాలని, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఘనంగా రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గులాబీ శ్రేణులు

తాండూరు టౌన్: మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు శుక్రవారం తాండూరులోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు శ్రీశైల్ రెడ్డి, రాజుగౌడ్, నయీమ్, వెంకట్ రెడ్డి, పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాస చారి, నరేందర్ గౌడ్, నర్సిరెడ్డి, రాజన్ గౌడ్, శోభారాణి, సంగీత, అనురాధ, శకుంతల, విజయ్, గోపాల్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

బంట్వారం: తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు కోట్‌పల్లి మండల కేంద్రంలో గులాబీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మహేందర్, నాయకులు రమేష్, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, ఇక్బాల్, కృష్ణ ఉన్నారు.

హద్దులు ఏర్పాటు చేయండి

కొత్తూరు: మండలంతో పాటు కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన రియల్ వెంచర్లలో ఆయా పంచాయతీలకు కేటాయించిన పది శాతం స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ శుక్రవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు.

'గృహజ్యోతి' కొందరికేనా?

అర్హులందరికీ అందని పథకం
- రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోండి
- నకిలీ విత్తనాలతో రైతులు జాగ్రత్త
- కొనసాగుతున్న 'ఆదర్శ'పనులు
- సర్వసభ్య సమావేశంలో సభ్యులు, అధికారులు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

ధారూరు: 'గృహజ్యోతి పథకం అర్హులందరికీ అందడం లేదు. 9,056 మంది దరఖాస్తు చేసుకోగా... 5,306 మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. మిగతా వారికి ఎందుకు ఇవ్వడం లేదు' అని పలువురు సభ్యులు ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని ప్రశ్నించగా.. అర్హులందరికీ అందుతుందని, అర్హులై ఉండి రాని వారు ఉంటే మరోసారి ఎంపీడీఓ కార్యాలయంలో అర్జీ పెట్టుకోవాలని ఏఈ సమాధానం ఇచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై సభ్యులు సభలో ప్రస్తావించగా.. సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. గృహజ్యోతి విషయంలో ఏఈ మాట్లాడుతూ.. 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించినట్లయితే.. మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. గట్టెపల్లి లైన్‌మెన్ కనిపించడం లేదని వెస్ ఎంపీపీ సభలో ప్రస్తావించగా.. త్వరలో బదిలీ ప్రక్రియ ఉందని, కొత్తగా మరో లైన్‌మెన్ రానున్నట్లు ఏఈ వెల్లడించారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి

వానాకాలం సీజన్‌లో రైతులు అధికంగా పత్తిని సాగుచేస్తున్నారని, గుర్తింపు పొందిన దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి, రసీదు పొందాలని వికారాబాద్ ఏడీఏ వినోద్‌కుమార్ సూచించారు. సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో ఏఈఓల ద్వారా నమోదు చేసుకోవాలని రైతులకు చెప్పారు. నకిలీ విత్తనాలతో నష్టపోవద్దన్నారు. రైతుబంధు డబ్బులు అర్హులందరికీ రాలేదని ఎంపీపీ సభ దృష్టికి తేగా.. కొందరి పేర్లు గల్లంతయ్యాయని ఏఓ ఝాన్సీలక్ష్మి తెలిపారు. మిగతా వారి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులకు రూ.2.56 కోట్లు మంజూరు అయ్యాయని, ఆ నిధులతో 13 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బీపీ, షుగర్ ఉన్నా లేకున్నా స్థానిక వైద్య శాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఉచితంగా మందులు తీసుకోవాలని ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు చెప్పారు. క్షయవ్యాధి బారిన పడకుండా.. బీసీజీ టీకా తీసుకోవాలని డాక్టర్ స్వాతి సూచించారు. మనఊరు–మనబడి ద్వారా పనులు చేసిన వారికి ఇంతవరకు బిల్లులు రాలేవని నాగారం ఎంపీటీసీ స్వేత సభలో ప్రస్తావించగా.. ఆ పథకం క్లోజ్ అయిందని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయకుమార్, ఎంపీటీసీలు బసప్ప, శ్రీనివాస్, నర్సమ్మ, రవీందర్, స్వేత పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు సాగాలి

ఐదేళ్ల పదవీ కాలం సంతృప్తినిచ్చింది. అందుకు సభ్యులు, అధికారుల సహకారం మరువలేనిది. సమస్యలపై సభలో ఎప్పటికప్పుడు సభ్యులు, అధికారుల మధ్య విస్తృత చర్చలు జరిగాయి. సమస్యల పరిష్కారంలో జరిగిన జాప్యంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. అయినా.. సర్దుకుపోయారు. ఇది చివరి సమావేశం. ఇక ముందు కూడా అధికారులు, ప్రజా ప్రతినిధులకు సహకరించుకుంటూ.. సమష్టిగా మండల అభివృద్ధికి కృషి చేయాలి.

– జైదుపల్లి విజయలక్ష్మి, ఎంపీపీ

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సూర్యనారాయణ

దోమ: రోడ్డు భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఏఎస్ఐ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధి ఊటుపల్లి గ్రామంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను దగ్గరే ఉంచుకోవాలని సూచించారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్ట్ ధరించడంతో పాటు స్పీడ్ లిమిట్‌ను పాటించాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చేయూత



బాల్‌రాజ్ కుటుంబానికి తోపుడు బండిని అందజేస్తున్న సంఘాల సభ్యులు

తాండూరు టౌన్: పేదరికంలో ఉన్న దివ్యాంగుడు మేడిశెట్టి బాల్‌రాజ్‌కు ఆర్యవైశ్య సంఘం, వైశ్య ఫెడరేషన్‌లు అండగా నిలిచాయి. పెండ్యాల అశోక్ కుమార్ సహకారంతో శుక్రవారం సంఘం తరుపున బాల్‌రాజ్ కుటుంబానికి తోపుడు బండి, వ్యాపార సామగ్రిని అందజేశారు. ఇందులో మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న, కౌన్సిలర్ సాహు శ్రీలత, వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం తాండూరు అధ్యక్షుడు ఆలంపల్లి శ్రీనివాస్, కార్యదర్శి కోడూరు వినోద్, ఉప కార్యదర్శి కుంచం సంపత్, వీరన్న, ఉదయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో మోస్తరు వర్షం

పరిగి: పరిగి పట్టణ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణంలో కొనసాగుతున్న వారంతపు సంత క్రయవిక్రయదారులతో ప్రాంతం సందడిగా ఉండగా.. ఒక్కసారిగా కురిసిన వానతో అంతా ఉరుకులు పరుగులు పెట్టారు. వర్షపు నీటితో సంత పరిసర ప్రాంతం చిత్తడిగా మారింది. సాయంత్రం వరకు ముసురు వీడకపోవడంతో వ్యాపారులు, రైతులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడ్డారు.

కొడంగల్‌లో..

కొడంగల్: నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీగా వర్షం పడింది. ఈదురు గాలులకు ఇండ్లపై కప్పిన ప్లాస్టిక్ కవర్లు ఎగిరి పోయాయి.



పరిగి: పట్టణంలో కురుస్తున్న వర్షం

స్పేర్ పంపులు, టార్పాలిన్ల పంపిణీ



స్పేర్ పంపులు, టార్పాలిన్లు పంపిణీ చేసిన గొల్లపల్లి రత్నాకర్, తదితరులు

షాబాద్: షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు స్పేర్ పంపులు, టార్పాలిన్లు పంపిణీ చేసినట్లు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ తెలిపారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ముద్దెంగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, రేగడిదోస్వాడ గ్రామాలకు చెందిన రైతులకు ఉప ప్రణాళిక ద్వారా స్పేర్ పంపులు, టార్పాలిన్లను ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘంలోని షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడారు. షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు నూనె గింజల సాగు వివరాలు, ఆదాయం పెంపు వంటి విషయాలను వివరించారు. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. నూనె గింజల పరిశోధనా ప్రతినిధి రాథోడ్ మాట్లాడారు. భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం నూనె గింజలసాగు అందిస్తున్న సేవలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు కూర వెంకటయ్య, అంజయ్య, భూపతిరాజు, యాదవరెడ్డి, నర్సింహా, శేఖరయ్య, సుదర్శన్, రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

కళలతో మంచి గుర్తింపు

పరిగి: కళలతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ అన్నారు. అభినయ కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు కొనసాగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం పట్టణ కేంద్రంలోని టీటీడీ కల్యాణ మంటపంలో నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, డాన్స్‌లో రాణించాలని సూచించారు. సాంస్కృతిక కళలను నేర్చుకుంటే.. సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. బాల్యం నుంచే చదువుతో పాటు.. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపండి

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్ నుంచి తిరుపతికి బస్సులు నడపాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రాలైన తిరుపతి, షిరిడీ, యాదగిరి గుట్ట, బాసర, శ్రీశైలం, మంత్రాలయం, వేములవాడ, మహానంది తదితర ప్రాంతాలకు నెలకు ఒకసారి అయినా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించి నెలలో ఒకరోజు తిప్పాలని కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

మండల వ్యవసాయ అధికారి రాగమ్మ



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్: ఫర్టి లైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాగమ్మ డీలర్లను హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధి వెంకటాపూర్‌లో శుక్రవారం సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి ఆమె తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు స్టాక్ వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని దుకాణదారులకు సూచించారు. రైతులు అడిగిన రకం విత్తనాలు కాకుండా ఇతర రకాలు ఇవ్వవద్దన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని.. రైతుల వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు అవసరమైన పత్తి, వరి, మొక్కజొన్న, కంది విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు



దీపిక 720/696



రిషిత 720/625

శంకర్‌పల్లి: ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో శంకర్‌పల్లి విద్యార్థిని దీపిక సత్తా చాటింది. ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి, మాధవి దంపతుల కుమార్తె దీపిక.. మియాపూర్ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. అనంతరం నీట్ పరీక్షా రాయగా 720 మార్కులకు గాను 696 మార్కులు సాధించి, ఆల్‌ఇండియా స్థాయిలో 2,672 ర్యాంకును సొంతం చేసుకుంది. దీంతో దీపిక తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: చిలుకూరు గ్రామానికి చెందిన విద్యార్థిని దర్గ రిషిత అత్యున్నత ప్రతిభ చాటింది. గ్రామానికి చెందిన నరేందర్, వందన దంపతుల కూతురు రిషిత.. శ్రీచైతన్య కళాశాలలో చదివి నీట్ రాసింది. ఈ ఫలితాల్లో 720 మార్కులకు గాను 625 సాధించింది. నీట్‌లో ఉత్తమ ఫలితం సాధించిన రిషితను గ్రామంలోని పలువురు నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



షాద్‌నగర్-ఆమనగల్లు రహదారి దుస్థితి

- గుంతల మయంగా షాద్‌నగర్-ఆమనగల్లు రోడ్డు
- అర్ధంతరంగా నిలిచిన నిర్మాణ పనులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

కేశంపేట: షాద్‌నగర్ నుంచి ఆమనగల్లుకు వెళ్లాలంటే 50 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఫరూఖ్‌నగర్, కేశంపేట, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల పరిధిలో గ్రామాలను కలుపుతు రోడ్డు విస్తరించి ఉంది. షాద్‌నగర్ నుంచి శ్రీశైలం, నాగార్జున సాగర్, నల్లగొండ వెళ్లడానికి ఈ రోడ్డు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఈ మార్గంలో ఎప్పుడూ వాహనల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సందర్భంగా దీనికి గతంలోనే డబుల్‌రోడ్డుగా మార్చారు. ఆమనగల్లు నుంచి కేశంపేట గ్రామం వరకు, షాద్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డు నుంచి ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం వరకూ బీటీ వేశారు. కమ్మదనం గ్రామం నుంచి కేశంపేట గ్రామం వరకు రోడ్డును నిర్లక్ష్యం చేయడం వలన గుంతలు ఏర్పడి, వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

నిలిచిన నిర్మాణ పనులు

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ రోడ్డు నుంచి కేశంపేట వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.15 కోట్లను మంజూరు చేసింది. షాద్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డు నుంచి ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం వరకూ బీటీ రహదారిని ఎన్నికల ముందు పూర్తిచేశారు. కమ్మదనం గ్రామం నుంచి మండల కేంద్రం వరకు రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేశారు.

భయం.. భయంగా ప్రయాణం

ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం నుంచి కేశంపేట వరకు సుమారు 15కిలో మీటర్ల దూరం వరకు రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహనదారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారిగుండా వెళ్లాలంటే భయం..భయంగా ఉందని వాపోతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కానరాక చాలా మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయని ప్రాంత ప్రజలు తెలిపారు. కేశంపేట నుంచి షాద్‌నగర్‌కు వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



దుద్యాల్: ఇంటింటి సర్వేలో ఉపాధ్యాయులు



దౌల్తాబాద్: ర్యాలీలో ఉపాధ్యాయులు తదితరులు

- ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలు
- బడీడు పిల్లలను పాఠశాలకు పంపండి
- బడిబాటలో ఉపాధ్యాయులు

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని రామపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వినీత అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీపీ కార్యదర్శి అశోక్, అంగన్‌వాడీ వర్కర్ విజ్జమ్మతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలకు పంపాలని హెచ్‌ఎం తల్లిదండ్రులకు సూచించారు. మూడేళ్లు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని చెప్పారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: బడీడు పిల్లలను బడికి పంపించాలని ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ నాయక్ గ్రామస్తులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా వారు సిబ్బందితో కలిసి ర్యాలీ తీశారు. ఇంటింటికీ తిరిగి బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని చెప్పారు. ప్రభుత్వ బడుల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యాబోధనతో పాటు, తగిన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, మీ పిల్లలను సర్కారు బడికి పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఇందులో హెచ్‌ఎం జరీన కౌసర్, ఉపాధ్యాయులు కల్పన దేవి, వసంత, మల్లప్ప, సుధాకర్ రావ్, విజయకుమార్, పీఈటీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి..

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంఈఓ హరిశ్చందర్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బడిబాట చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడిబాటలో ప్రతి ఉపాధ్యాయుడు ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను బోధించడమే కాకుండా.. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ప్రభుత్వమే అందజేస్తుందన్నారు. ఇదే విషయాన్ని గ్రామస్తులకు వివరించి, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వెల్లడించారు.

బంట్వారంలో..

బంట్వారం: అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిచాలని ఎంపీడీఓ రాములు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రైవేటు స్కూళ్లకంటే నాణ్యమైన విద్య సర్కారు బడుల్లోనే అందుతుందని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఇందులో ఎంఈఓ చంద్రప్ప, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.



బంట్వారం: చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములు తదితరులు

ప్రైవేటు బడి వద్దు



బడిబాటలో కౌన్సిలర్ సంగీతా తదితరులు

తాండూరు టౌన్: ప్రైవేటు పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దు అని బీఆర్ఎస్ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ అన్నారు. గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాటలో ఆమె ఇంటింటికి తిరిగి చిన్నారులను సర్కారు బడికి పంపించాలని వారి తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, మీ పిల్లలను చేర్పించి విద్యావంతులుగా మార్చుకోవాలని సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు మాధవి, పాఠశాల చైర్‌పర్సన్ లలిత, ఉపాధ్యాయురాలు రాణి, అంగన్‌వాడీ టీచర్ రాధ, ప్రత్యేక అధికారి రాములు, ఆర్పీ శోభ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.